క్లుప్తంగా

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ఆత్మకూరు: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, దళిత జర్నలిస్టులకు దళిత బంధు పథకాన్ని అమలు చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ మండల యూత్ ప్రధాన కార్యదర్శి తనుగుల సందీప్ విమర్శించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుకలపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం వివక్ష చూపుతోందని అనానరు. గత ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తామని చెప్పిన కేసీఆర్.. నేటికీ అమలు చేయలేదని అన్నారు. ప్రశ్నిస్తే మీడియాపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే దళిత జర్నలిస్టులకు దళిత బంధు, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా రాజయ్య



కమలాపూర్: కమలాపూర్ మండలంలోని కన్నూరు బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా కసరబోయిన రాజయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ ఆదేశాల మేరకు గ్రామ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గోపగాని సతీష్, ప్రధాన కార్యదర్శిగా వంటకాల సంజీవరెడ్డి, సహాయ కార్యదర్శిగా ఎగ్గోజి బ్రహ్మచారి, కోశాధికారిగా ఇనుగాల రాజు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. యువజన విభాగం అధ్యక్షుడిగా పల్లెపాటి రాకేష్‌రావు, సోషల్ మీడియా అధ్యక్షుడిగా తవుటం గణేష్, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా బిల్లకంటి వినీత్‌ను ఎన్నుకున్నారు. అనంతరం గ్రామ శాఖ అధ్యక్షుడు రాజయ్య మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తల సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుల్లూరి రాంచందర్‌రావు, ఎంపీటీసీ వీరమనేని భాస్కర్‌రావు, ఉప సర్పంచ్ మాట్ల కుమారస్వామి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వెనిశెట్టి సుధాకర్, సీనియర్ నాయకులు పుల్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీమేధా దక్షిణమూర్తి విగ్రహ ప్రతిష్ఠాపన



పరకాల: పరకాల పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీమేధా దక్షిణమూర్తి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

టీటీడీ బధిరుల స్కూల్‌లో ప్రవేశాలు

హన్మకొండ అర్బన్: నగరంలోని ప్రగతినగర్ కాలనీఫేస్ -2లో తిరుమల తిరుమతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవెంటేశ్వర బధిరుల పాఠశాలలో 2023 -24వ సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జె.లక్ష్మీనరసమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 1, 2, 3వ తరగతులు చదువుతూ 6నుంచి 10ఏళ్ల వయస్సు లోపు విద్యార్థులు మే 31 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు 10వ తరగతి వరకు ఉచిత హాస్టల్ వసతి, బోధన ఉంటుందని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు దివ్యాంగుల సదరం సర్టిఫికెట్, జననం ధ్రువీకరణ పత్రం, టీసీ, రేషన్, ఆధార్ కార్డు, కులం, ఆదాయం సర్టిఫికెట్, నాలుగు పాస్‌పోర్టు ఫొటోలు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు 63005 85912, 98660 78731 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

నర్సింగ్ స్కూల్‌ను కొనసాగించాలి

ఎంజీఎం: 70ఏళ్ల నుంచి ఎంతోమంది పేద ఎస్సీ, ఎస్టీ బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థినులకు జీఎన్ఎం ట్రైనింగ్ ఇస్తున్న నర్సింగ్ స్కూల్‌ను కొనసాగించాలని నర్సింగ్ ట్యూటర్స్ కోరారు. ఈమేరకు ఎమ్మెల్సీ నరేందర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. స్కూల్ ఆఫ్ నర్సింగ్‌ను తీసివేసి దానికి స్థానంలో బీఎస్సీ నర్సింగ్ కళాశాలను నడిపించాలనే ఆలోచనను మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నర్సింగ్ ట్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ప్రభావతి, ప్రధాన కార్యదర్శి రెబెక్క, మణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

22న కేజీబీవీల సమస్యలపై ధర్నా

విద్యారణ్యపురి: కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాలు, యూఆర్‌ఎస్‌ల్లో పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని, వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న హనుమకొండలోని ఏకశిల పార్కు వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సదాశివరెడ్డి, పెండెం రాజు శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. కేజీబీవీల్లో కేర్ టేకర్‌ను నియమించాలని, నైట్ డ్యూటీల నుంచి మహిళా సిబ్బందిని మినహాయించాలని పేర్కొన్నారు.

రోడ్లు, డ్రెయినేజీలను పరిశుభ్రంగా ఉంచాలి

● ఎంపీడీఓ పల్లవి



కమలాపూర్: ఉప్పల్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ పల్లవి, తదితరులు

కమలాపూర్: గ్రామాల్లోని రోడ్లు, డ్రెయినేజీలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ పల్లవి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన పల్లె ప్రగతిలో భాగంగా కమలాపూర్ మండలం ఉప్పల్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రోడ్లు, డ్రెయినేజీలు, పారిశుద్ధ్య పనులు, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్, తెలంగాణ క్రీడా ప్రాంగణం, పెద్ద చెరువును పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం 'డ్రై' డే పాటించాలని, నీరు నిలువ ఉన్న ప్రాంతాలన్నింటిని శుభ్రం చేయాలని, హరితహారంలో భాగంగా ప్రతి శుక్రవారం గ్రీన్ డే నిర్వహిస్తూ నాటిన ప్రతీ మొక్కకు నీరు పట్టి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. గ్రామాల్లోని రోడ్లు, డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, నీరు నిలువకుండా, చెత్తాచెదారం లేకుండా చూడాలని మల్టీపర్పస్ వర్కర్లను ఆదేశించారు. ఇళ్లల్లో వినియోగించిన నీటిని ఇంకుడు గుంతల్లోకి వెళ్లేలా, పెరటి మొక్కల పెంపకానికి ఉపయోగించేలా, డ్రెయినేజీల్లో చెత్తాచెదారం వేయకుండా, రోడ్లు, డ్రెయినేజీలు శుభ్రంగా ఉండేలా చూసుకునేలా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా స్వశక్తి సంఘ మహిళలు, ఆశ వర్కర్లు, గ్రామస్థాయిలో పనిచేసే అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటికి మూడు పూల మొక్కలు, మూడు పండ్ల మొక్కలు సరఫరా చేయాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతి రోజు ఉదయం 6 గంటలకే గ్రామాలకు చేరుకుని మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రభుత్వం నిర్దేశించిన రోజు వారి కార్యక్రమాలను పూర్తి చేసి సంబంధిత ఫొటోలు, వీడియోలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవేందర్‌రావు, వార్డు సభ్యులు, ఈజీఎస్, జీపీ సిబ్బంది, మహిళా సంఘం సీఏలు, ఆశ వర్కర్లు, మల్టీపర్పస్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



ముస్త్యాలపల్లిలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ శంకర్, తదితరులు

పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలి

దామెర: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. పారిశుద్ధ్య పనుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముస్త్యాలపల్లిలో ఎంపీపీ శుక్రవారం పర్యటించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని అంతర్గత రహదారాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రతి ఇంటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరుచేసి వాహనాల్లో గ్రామ డంపింగ్ యార్డుకు తరలించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్డెపల్లి శ్రీనివాస్, ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సతీష్, పంచాయతీ కార్యదర్శి ధర్మారెడ్డి తదితరులు ఉన్నారు.

నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

శాయంపేట: రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పాడైపోయిన వస్తువుల్లో నీరు నిల్వ ఉన్నట్లయితే దోమలు ప్రబలి అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని, ఈక్రమంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ గ్రామస్తులకు సూచించారు. శుక్రవారం డ్రైడేను పురస్కరించుకొని పలు కాలనీల్లో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జోత్స్న, రత్నమాల, శ్వేత, స్వరూప, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

● పరకాల ఏసీపీ శివరామయ్య



పెద్దకోడెపాక కొనుగోలు కేంద్రంలో తూకాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ శివరామయ్య

శాయంపేట: రైతులు పండించిన వరి ధాన్యం, మక్కల కొనుగోళ్లలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మోసం చేస్తే పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని పరకాల ఏసీపీ శివరామయ్య హెచ్చరించారు. మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అక్కడే ఉన్న రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో ఏమైనా సమస్యలు తలెత్తుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రైతులను నష్టపరిచే విధంగా ధాన్యం తూకంలో తప్పులు గానీ, ఎక్కువ తరుగు తీసినట్లు ఫిర్యాదు వస్తే వారిపై కఠిన చర్య తీసుకుంటామని హెచ్చరించారు, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తాగునీరు, నీడ వసతి కల్పించాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో పని చేసే ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి రైతులకు సహకరించాలని కోరారు. రైతులు తమ సమస్యలపై వరంగల్ పోలీస్ కమిషనర్ వాట్సాప్ నంబర్ ద్వారా సమాచారాన్ని పంపవచ్చని తెలిపారు. ఆయన వెంట పరకాల రూరల్ సీఐ శ్రీనివాసారావు, ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు ఉన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తాం

శాయంపేట: విత్తన విక్రయ దుకాణదారులు నాసిరకం విత్తనాలను రైతులకు విక్రయిస్తే పీడీయాక్ట్‌ను నమోదు చేస్తామని పరకాల రూరల్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని ఫర్టిలైజర్ షాపులపై సీఐ శ్రీనివాసరావు, ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు కలిసి ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. విత్తనాల ప్యాకెట్లు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విత్తన విక్రయ దుకాణాల్లో కాలం చెల్లిన విత్తనపు సంచులు రైతులకు విక్రయించినా, నకిలీ విత్తనాలు అమ్మినా, అధిక ధరలకు అమ్మిన పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎరువుల పురుగు మందుల విత్తనాల ధరలను పట్టికను దుకాణం ముందు రైతులకు కనిపించేలా ఏర్పాటు చేయాలని అన్నారు. ప్యాకెట్లను కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు బిల్లులు అందించాలని సూచించారు.

ఆపదలో ఉన్నవారికి అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ రవిందర్

ఎల్కతుర్తి: ఆపదలో ఉన్నవారికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలిచి ఆదుకుంటోందని ఎంపీపీ జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవిందర్ అన్నారు. భీమదేవరపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో 12మంది లబ్ధిదారులకు రూ.3లక్షల 17వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా అమలుకాని అనేక సంక్షేమ పథకాలను రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. అభివృద్ధిలో తెలంగాణ ముందంజలో ఉందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు మాడుగుల కొమురయ్య, వెంకటరాములు, ఎంపీటీసీలు కొత్తకొండ లలిత, సాతూరి రమాదేవి, నాయకులు రమేష్, నాగరాజు, శనిగరం సదానందం, రచ్చ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి 'మేరే లైఫ్ -మేరే స్వచ్ఛ షెహర్'

● పరకాల మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి

పరకాల: ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న మేరే లైఫ్ -మేరే స్వచ్ఛ షెహర్ క్యాంపెయిన్‌ను శనివారం నుంచి వచ్చే నెల 5 వరకు పరకాల మున్సిపాలిటీ పరిధిలో వార్డుల వారీగా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఇంటిలోని పనికి రాని వస్తువులు(బట్టలు, డబ్బాలు, ప్లాస్టిక్, ఇతర వస్తువులు) స్వచ్ఛందంగా తెచ్చి సెంటర్ వద్ద అందజేయాలని సూచించారు.

రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి



వినతిపత్రం అందజేస్తున్న డీఎస్పీ నాయకులు

దామెర: ప్రతిఒక్కరూ భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) రాష్ట్ర కమిటీ సభ్యులు రాజు పూలమాల సూచించారు. అందరికి రాజ్యాంగ గ్రంథం పంపిణీ చేయాలని కోరుతూ మండల కేంద్రంలో తహసీల్దార్ ఎండీ.రియాజుద్దీన్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నూటికి 90శాతం మందికి రాజ్యాంగం పట్ల అవగాహన లేక పార్లమెంటరీ, ప్రజాస్వామ్య వ్యవస్థ విఫలం అవుతోందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్.రత్నాకర్, ఎం.యుగేందర్, రాజు, నాగరాజు, ప్రవీణ్ ఉన్నారు.

ఉపాధిహామీ పెండింగ్ బిల్లులు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చక్రపాణి

దామెర: ఉపాధి హామీ పథకంలో భాగంగా పనిచేస్తున్న కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ప్రజా సంఘాల సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. వారం రోజుల్లో కూలీలకు చెల్లించాల్సిన డబ్బులు.. ఆరు నెలలైనా చెల్లించకుండా శ్రమ దోపిడీ పాల్పడుతున్నారని వాపోయారు. తరుగు పేరుతో కొనుగోలు కేంద్రాల్లో పది నుంచి 14 కిలోల కోతపెట్టడం సరికాదని ఆక్షేపించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు గాజు రాజు, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా నాయకుడు వేల్పుల రమేష్, కేవీపీఎస్ జిల్లా నాయకులు గాదె రమేష్, ప్రజా సంఘాల నాయకులు పున్నం సంతోష్, శ్రీనివాస్, మొగిలి, శంకర్, సూర్యనారాయణ, గోవిందు ప్రతాప్, ఎదురు రమేష్, వంగ శ్రీకాంత్, పాముల మూగయ్య, దండు సారంగపాణి, అశోక్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక లాభాలు



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

శాయంపేట: పంట సాగులో రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను గడించవచ్చని అసోసియేషన్ పీయూ మేనేజర్ అక్కల రమేష్ అన్నారు. మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామంలో శుక్రవారం ప్రజ్వల్ రైతుల ఉత్పత్తిదారుల సంఘం క్షేత్ర కార్యకర్తల పోరండ్ల భానుమతి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు సాగులో మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండెకారి రజిత, క్షేత్ర సదుపాయకర్తలు, పల్నాటి రాంబాబు, కుక్కల కల్పన, పోతు సునీల్, తరాల తిరుపతి, హిమబిందు, రైతులు శంకర్‌రావు, రాజేందర్, సుధాకర్, బాపురావు, శ్రవణ్, రాజేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు మోడల్ స్కూల్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కమలాపూర్: కమలాపూర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)నకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.అనిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎ.హాసిని, పి.సత్యసిద్ధార్థ, ఎస్.ప్రణీత్, సీహెచ్.చరణ్‌తేజ, బి.నరేంద్ర, ఎస్.భరత్ అనే ఆరుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారని, వారికి ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు రూ.48 వేలు స్కాలర్‌షిప్ వస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

వివాహానికి ఆహ్వానించిన ఎమ్మెల్యే ధర్మారెడ్డి



ఆత్మకూరులో పత్రిక అందిస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు: తన కుమార్తె జాహ్నవి వివాహ పత్రికను మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల ప్రజలకు అందజేసి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆహ్వానించారు. మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఎమ్మెల్యే దంపతులు శుక్రవారం పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్క సుమలత, జెడ్పీటీసీ రాధిక, వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, నాయకులు దుంపల బుచ్చిరెడ్డి, పాపని రవీందర్, వంగాల భగవాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



అరవింద్‌కుమార్, వినయ్‌భాస్కర్‌కు వినతి పత్రాలు అందజేస్తున్న నాయకులు

వరంగల్ అర్బన్: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు కమ్ ఓనర్లు, అర్బన్ మలేరియా విభాగంలోని ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీసం వేతనం రూ.26వేలు ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు రాష్ట్ర పురపాలక శాఖ చీఫ్ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్‌లకు హనుమకొండ 'కుడా' కార్యాలయం ఆవరణలో వినతి పత్రాలను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రవి, మున్సిపల్ అధ్యక్షుడు నద్దునూరి రాజేష్ ఖన్నా, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు పడాల రామ్మూర్తి, మలేరియా విభాగం అధ్యక్షుడు అల్వాల ఉమేందర్, నాయకులు మట్టెడ అనిల్, మేకల సమ్మయ్య, రవితేజ, సురేందర్, పున్నం చందర్, మహేందర్, సాంబరాజు, శ్రీనివాస్, రామచందర్, మైదాన్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్‌గా గంగపుత్రులనే నియమించాలి



మాట్లాడుతున్న పాక ఓంప్రకాష్

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్‌గా గంగపుత్రులనే నియమించాలని హనుమకొండ, వరంగల్ జిల్లా గంగపుత్రుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం వరంగల్, హనుమకొండ జిల్లా సమావేశం జిల్లా సెక్రటరీ జనరల్ పాక ఓంప్రకాష్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలను ఓంప్రకాష్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 45ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్‌గా ముదిరాజ్ వర్గానికి చెందిన పిట్టల రవీందర్, ఉపాధ్యక్షుడిగా గంగపుత్ర వర్గానికి చెందిన దీటి మల్లయ్యను నియమించడాన్ని తీవ్రంగా ఖండించారు. గంగపుత్రులనే చైర్మన్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల గంగపుత్ర సంఘాల నాయకులు డాక్టర్ గోపు సుధాకర్, పొక్కుల కృష్ణమూర్తి, జునుగురి దుర్గా ప్రసాద్, పారిపల్లి క్రాంతికుమార్ పాల్గొన్నారు.

బయటికెళ్లాలంటే భయం..



కాజీపేట: కుక్కలు బాబోయ్... కుక్కలు అంటూ బెంబేలెత్తిపోతున్నారు కాజీపేట పట్టణానికి చెందిన పలు కాలనీలకు చెందిన ప్రజలు. ఇటీవల నాలుగు రోజుల కింద ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ రమేష్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. శుక్రవారం రైల్వే క్వార్టర్స్ సమీపంలో బతుకుదెరువు నిమిత్తం పొట్ట చేతబట్టుకుని వలస వచ్చిన ఓ కుటుంబానికి చెందిన చోటు అనే ఆరేళ్ల బాలుడిని కుక్కలు దాడి చేసి చంపేయడం కాజీపేట పట్టణంలో సంచలనంగా మారింది.

తరచూ దాడులు

ఇటీవల పది రోజుల్లో ఆరుగురు వ్యక్తులపై దాడి చేసి గాయపర్చాయి. తిలక్‌నగర్, న్యూసోమిడి, యాదవనగర్‌లో పిల్లలపై కుక్కలు దాడిచేసి గాయపర్చిన ఘటనలున్నాయి. దీంతో పిల్లల్ని బయటకు ఒంటరిగా పంపించాలంటే భయంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. బైక్‌లు, కార్లపై కుక్కలు దాడులు చేస్తున్నాయి. దాంతో వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కుక్కల బెడదను అరికట్టాలని పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


కుక్కల బెడదపై దృష్టి పెట్టాలి...



నగరంలో నానాటికి పెరుగుతున్న కుక్కల బెడదపై బల్దియా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఏ కాలనీలో చూసిన గుంపుగుంపులుగా తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఆస్పత్రుల్లోనూ మందుల కొరత వేధిస్తోంది.

- దొంగల కుమార్, బోడగుట్ట

శునకాలను నియంత్రించాలి



కాలనీల్లో సంచరిస్తున్న కుక్కల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గువుతున్నారు. కుక్క కరిస్తే ఆస్పత్రి చుట్టూ తిరగాల్సి వస్తోంది. దీనివల్ల ఇల్లు, ఒళ్లు గుల్లా అవుతుందని అధికారులు గుర్తించాలి. వెంటనే కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలి.

- వస్కుల శంకర్, మడికొండ

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి



మెలకువలు నేర్పుతున్న ఇన్‌స్పెక్టర్ సంజీవరావు

మామునూరు: విద్యార్థులు, యువతులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని షీటీమ్ ఇన్‌స్పెక్టర్ వై.సంజీవరావు సూచించారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో టీఎస్8 గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లకు శుక్రవారం అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని సూచించారు. సైబర్ నేరాలు జరిగితే టోల్‌ఫ్రీ 1930కు ఫిర్యాదు చేయాలని కోరారు. 87126 85257, 87126 85270, 87126 85270ల లో ఫిర్యాదు చేయాలని సూచించారు. రాజేష్ కౌశిక్, రేవతి, ప్రభాకర్, సుజాత దేవి, శోభాదేవి, కుమారస్వామి, ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, బిచ్చ నాయక్, రాంరెడ్డి, పూర్ణ, లక్ష్మి పాల్గొన్నారు.

ఇంటింటికి పోస్టాఫీస్ సేవలు



కరపత్రం అందజేస్తున్న హరికృష్ణ

కాజీపేట అర్బన్: ఇంటింటికి పోస్టాఫీస్ సేవలందిస్తామని పోస్టాఫీస్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ హరికృష్ణ తెలిపారు. కాజీపేట మండల కడిపికొండ గ్రామంలో శుక్రవారం ఇంటింటికి తిరుగుతూ పోస్టాఫీస్ సేవలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ పథకంలో మహిళలు, బాలికలు రూ.వెయ్యి నుంచి రూ.2 లక్షల వరకు డిపాజిట్ చేసుకోవచ్చని వివరించారు. అందుకు 7.5 శాతం వడ్డీ లభిస్తుందని తెలిపారు. పోస్టాఫీస్ సేవలను ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పోస్టాఫీస్ సిబ్బంది ప్రభంజన్, రాజేందర్ పాల్గొన్నారు.